ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
సోమవారం | 03 నవంబరు, 2025 | పేజీలు :04

## అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** తమకు సంబంధించిన సొంత భూమిలో రాకేష్ అనే వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని, రాకేష్ పైన అతనికి సహకరిస్తున్న అధికారులపైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తీర్థాల కోమురెల్లి ఆదివారం తెలంగాణ డిజిపికి లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.తమ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్ట కూడదని మంథని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ రాకేష్ అధికారుల సహకారంతో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నటువంటి రాకేష్, అతనికి సహకరిస్తున్నటువంటి అధికారుల పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రేవంత్ పాలనతో కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నడుస్తున్న ప్రజాపాలనను చూసి ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు. ఆదివారం లక్ష్మణచందా మండల కేంద్రంలో బీజేపీకి చెందిన పలువురు యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు యువకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తోందని, ఆరు గ్యారెంటీలను నిబద్ధతతో అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే ఇతర పార్టీల కార్యకర్తలను కాంగ్రెస్ వైపు దారితీస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు వడ్నాల రాజేశ్వర్, నగేష్, ఓసా రాజేశ్వర్, ప్రతాపరెడ్డి, కల్లెడ భూమన్న, మైనారిటీ నాయకులు అస్గర్,ఆత్మ డైరెక్టర్ కిరణ్ ఠాకూర్, సమ్మెట రవి తదితరులు పాల్గొన్నారు.



## 11వ వరకు నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** పెద్దపల్లి జిల్లా దేవునిపల్లి శ్రీలక్ష్మి నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 11వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ బొడ్డుపల్లి సదయ్య, అర్చకులు కొండపాక శ్రీకాంతాచార్యాలు, ఎండోమెంటు కార్యనిర్వాహణాధికారి ముద్దసాని శంకర్, ధర్మకర్తలు శ్రీపతి సుమన్, ఆడెపు సౌందర్య, ఇట్యాల సతీష్, తాళ్లపల్లి రాజమౌళి, గాజుల సురేష్, ముడుసు శ్రీనివాస్‌లు తెలిపారు. ఈనెల 5వ తేదీ బుధవారం ఉదయం 11:45 గంటలకు శ్రీస్వామివారి కల్యాణోత్సవం, ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం 05:45 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏటా నిర్వహించే స్వామి వారి బ్రహ్మోత్సవాలు, దేవునిపల్లి జాతరకు పెద్దపల్లి జిల్లాతోపాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు అధికసంఖ్యలో తరలిరానున్నారు.

## 48 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దొంగలించినట్లు సొమ్మును అమ్మేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసినట్లు 1వ పోలీస్ స్టేషన్ సిఐ రఘుపతి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అతర్ బైగ్, మీర్జా అతర్ బైగ్ అత్తు (21) తండ్రి సలీం బైగ్, నిజామాబాద్‌కు చెందిన షేక్ అజ్మాద్ అహు తండ్రి షేక్ అలీ అహ్మద్ (24) ఇద్దరు నేరస్తులు మందు, సిగరెట్, గుట్కా వంటి చెడు అలవాట్లు బానిసై వచ్చిన డబ్బులు జల్సాలకు చెడు అలవాట్లకు సరిపోవటం లేదని ఒంటరిగా కనిపించే వారిని బెదిరించి వారిని కొట్టి వారి దగ్గర డబ్బులు లేదా ఏవైనా విలువైన వస్తువులు దొంగతనం చేద్దామని లేదంటే ఇళ్లలో దొంగతనాలు చేసి దోచుకున్న డబ్బులతో జల్సాకు, చెడు అలవాట్లకు వాడుకోవచ్చనే ఉద్దేశ్యంతో వారు అక్టోబర్ 31న ఉదయం 3 గంటలకు ఎరుకలవాడ లోని ఒక ఇంటికి వెళ్లి బీరువాలో పగలగొట్టి బంగారు, ఆభరణాలు, రూ.1500 ల నగదు ఒక ఫోన్‌ను దొంగలించుకుని వెళ్లినట్లు తెలిపారు. వారు దొంగలించిన సొమ్మును ఎవరికైనా అమ్ముటకు ఆదివారం గంజ్ మార్కెట్‌లో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించగా వారిని పట్టుకుని వారి వద్ద నుండి బంగారు ముక్కుపుడక ఉంగరం, వెండి కడియాలు ,ఒత్తులు, వివో 1902 బ్లూ కలర్ స్మార్ట్ ఫోన్ రూ.1500 ల నగదును స్వాధీనపర్చుకుని వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు .వీరిపై ఇదివరకే దొంగతనాల కేసులు, హత్యాయత్నం కేసులున్నాయని వీరిలో ఒకడు అతర్‌బైగ్ నెలన్నర క్రితమే జైలు నుండి విడుదలైనట్లు తెలిసిందని తెలిపారు. ఈ కేసును ఛేధించడంలో సిఐ రఘుపతి పర్యవేక్షణలో ముఖ్యపాత్ర వహించిన 1వ ఎస్సై జి.మహేష్, ఎఎస్సై షకీల్, పీసీలు గంగారాం, ప్రభురాజ్‌లను ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అభినందించామని తెలిపారు.



# ముఖ్యమంత్రి, మంత్రి, రాష్ట్ర సలహాదారుడి చిత్ర పటాలకు క్షీరాభిషేకం

**ప్రజాపక్షం/బోధన్:** వర్షాకాలం రైతులు పండించిన వరి పంటకు వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 ల బోనస్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకున్నందుకు ఆదివారం ఉమ్మడి బోధన్ మండలం జాడి జమాల్ పూర్ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన సభ్యులు మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చిత్ర పటాలకు సాలూర మండల, జాడి గ్రామ రైతుల తరపున గ్రామం తరపున పాలాభిషేకం చేశారు. జాడి గ్రామ రైతులు సుందర్ రాజు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలతోని దిగుబడి తగ్గి రైతులు ఆందోళనలో ఉన్న సమయంలో రైతులకు బోనస్ ఇచ్చి, ఏకకాలంలో వడ్లు కాటా వేసి రైస్‌మిల్ కెళ్లిన మూడు రోజుల్లో నిధులు విడుదల చేసినందుకు రైతుల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సలహాదారులు సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకబాబు, శ్రీనివాస రావు, సూరిబాబు, నాగేష్, నానిబాబు, మాజీ సర్పంచ్ రాములు, ఆంజనేయులు, రామకృష్ణ, కరామత్, మజార్, గోరంజి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బడా భీమ్‌గల్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోదిరె స్వామి, కన్నె సురేందర్, నాయకులు రమేష్, శ్యామ్‌రాజ్, జనార్ధన్, శ్రీను పాల్గొన్నారు.

## కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని బస్వా గార్డెన్‌లో అమేచూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. దానికి ముఖ్యఅతిథిగా తైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు తైక్వాండో లాంటి విద్య ఎంతో అవ సరమని తైక్వాండో నేర్చుకోవటం వారు క్రమశిక్షణతో పాటు శారీరకంగా, మానసికంగా అన్ని రంగాల్లో ముందుంటారన్నారు. రానున్న ఛాంపియన్‌షిప్ లలో బంగారు పతకం సాధించి మన జిలాకు మన తెలంగాణకు మంచి పేరు తీసుకరావలని కోరారు. తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ కోచ్ మనోజ్‌ను అభినందించారు. బెల్ట్ పరీక్షల్లో పాల్గొన్న ప్రతి పిల్లలకు బెల్ట్ అందజేస్తూ సర్టిఫికెట్లు అందజేశారు.

## ఘనంగా సంత్ నాందేవ్ మహారాజ్ జయంతి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** హనుమాన్ జంక్షన్ వద్ద గల మహానీయుల ప్రాంగణంలో సంత్ శిరోమణి సద్గురు శ్రీనామదేవ మహారాజ్ 756 వ జయంతి వేడుకలు మేరు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేరు సంఘం సభ్యులు సోమ హన్మంతరావు, పోల్కం గంగా కిషన్, దశరథ్, దేవదాస్, చంద్రకాంత్, సుదర్శన్, సంతోష్, రఘు పాల్గొన్నారు.

## జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేందర్ సన్నీ

**ప్రజా పక్షం/పెద్దపల్లి రూరల్ :** మార్వాడీ గో బ్యాక్ జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దపల్లికి చెందిన బొంకూరి సురేందర్ సన్నీని నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి తెలిపారు. ఈ మేరకు ఆదివారం సన్నీకి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ సన్నీ మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్ నుండి వచ్చిన మార్వాడీలు స్థానికుల వ్యాపార, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

# పంట నష్టపరిహారం ఇవ్వండి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో గత వారం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల మండలంలోని అనేక గ్రామాలలో చేతికొచ్చిన వరి పంట గాలివానకు నేలకొరిగి రైతులకు అపార నష్టం వాటిల్లిందని స్థానిక రైతులు తెలిపారు. దీంతో రైతులు అష్టకష్టాల గురయ్యే అవకాశం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం దీని దృష్టిలో ఉంచుకొని నష్టపోయిన పంటలను సంబంధిత వ్యవసాయ అధికారుల ద్వారా సర్వే నిర్వహించి పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరానికి 30వేల రూపాయల నష్ట పరిహారం అందించి రైతు కుటుంబాలను ఆదుకోవాలని మండల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# రాష్ట్ర సలహాదారున్ని కలిసిన బోధన్ నాయకులు

**ప్రజాపక్షం/బోధన్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డికి క్యాబినెట్ హోదాలో రాష్ట్ర సలహాదారులుగా నియమించినందుకు ఆరు గ్యారంటీల సం క్షేమ అభివృద్ధి పథకాల అమలుపై సమీక్షించే అధికారం క్యాబినెట్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నగరంలోని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాష్ట్ర సలహాదారుని నివాసంలో బోధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బోధన్ మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ భర్త తూము శరత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛ బిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికాంత్ చారి, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## జుక్కల్ నియోజకవర్గంలో పూర్తికాని రోడ్డు పనులు

**ప్రజాపక్షం/పిట్లం:** జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రోడ్లు అధ్వాన్నంగా మారాయిని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ కాట్రోత్ రవీంధర్‌నాయక్ పేర్కొన్నారు. పిట్లం మండలకేంద్రంతో పాటు మండలకేంద్రం నుండి మద్దెల్‌చెర్వు వరకు రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందని, అదేవిధంగా బిచ్కుంద పట్టణంలో మరీ దయనీయంగా తయారైందని వాపోతున్నారు. నూతనంగా వేస్తున్న రోడ్లకు నీళ్ళు చల్లకపోవడంతో వాహనదారుల రాకపోకల సమయంలో దుమ్ము లేచి ఇబ్బందకరంగా తయారైందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మారి 3 సంవత్సరాలు కావస్తున్నా ఇంకా రోడ్లు పూర్తికాకపోవడం విచారకరమని, వెంటనే రోడ్ల పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యమో లేదా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యమో తెలియదు గాని రోడ్డుపై వెళ్తున్న వారి పాలిట శాపంగా మారిందని రవీంధర్‌నాయక్ పేర్కొన్నారు.



## రాజీ మార్గమే రాజా మార్గం

**ప్రజాపక్షం / బెల్లంపల్లి:** నవంబర్ 15వ తేదీన జరిగే స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని బెల్లంపల్లి 1 టౌన్ సిఐ శ్రీనివాస రావు తెలిపారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో కక్షిదారులు ఇరు పార్టీలు రాజీ పడి గొడవ పడిన కేసులు, ఆక్సిడెంట్ కేసులు, చీటింగ్ కేసులు, ల్యాండ్ ట్రెస్పాస్ కేసులు, చిన్న చిన్న పెట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు ఇతర అన్ని కేసులను పరిష్కరించుకొని కేసులను తీసివేసుకోగలరు అని ఆయన కోరారు.



## కళాశాలల బంద్‌కు బిసి సంఘాల సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం నుంచి నిర్వహించలపెట్టిన కళాశాలల బంద్‌కు బిసి సంఘాల పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు తెలిపారు. కానీ ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదన్నారు. కళాశాలలు చేపడుతున్న ఉద్యమంలో బిసి సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొంటామని ప్రకటించారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే నిధులు విడుదల చేయకుండా కాంగ్రెస్ సర్కారు విధ్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి కళాశాలలను, విధ్యార్థులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సలీం పాషా ఆద్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జన్మదినాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణ చౌరస్తాలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ వెంకట్ ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వొల్లాల శ్రీనివాస్, డాన్ రమేష్, కృష్ణ, మోహన్, సలీం, పోతుల శ్రీనివాస్, గడ్డం రమేష్, శ్రీనివాస్, కోరె సదానందం, నరికె సుమన్, రమేష్, వంశీరెడ్డి, చింటూ రాజు తదితరులున్నారు.

## ఆదర్శం.. యువకుడి రక్తదానం..!

ప్రజాపక్షం/గోదావరిఖని : రామగుండం నగరపాలక ఒకటొ డివిజన్ ఇందిరమ్మకాలనీకి చెందిన మారేపల్లి రాజేశ్వరి కంటి శస్త్రచికిత్సకు రక్తం అవసరం ఏర్పడింది. గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతున్నది. రాజేశ్వరికి రక్తం తక్కువగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు సాయం చేయాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్‌ను కుటుంబసభ్యులు కోరారు. మడిపెల్లి మల్లేష్ సూచన మేరకు స్థానిక కటుకు వినయ్ మిత్ర బృందం స్పందించింది. బృందానికి చెందిన యువకుడు మనోజ్ ముందుకువచ్చి రాజేశ్వరికి ఆదివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వినయ్ మిత్ర బృందంతోపాటు మనోజ్‌ను పలువురు అభినందించారు.

## రామగుండంలో కార్తీక దీపోత్సవం

**ప్రజాపక్షం/గోదావరిఖని :** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రామగుండం పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆలయ అర్చకులు తులసిమాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మంగళహారతులతో తులసిమాతకు పూజలు చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : సోమవారం రోజున పెద్దపల్లి పట్టణంలో గల సుభాష్ నగర్ రోడ్డులో మున్సిపల్ కొత్త డ్రైనేజీ మరియు రోడ్డు వెడల్పులో బాగంగా విద్యుత్ పోల్స్ మరమత్తుల కారణంగా సుభాష్ నగర్, గ్యాస్ ఆఫీస్ ఏరియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏరియా, కమాన్ బస్ స్టాప్, లొ సమయము ఉదయం 09:00 నుండి మధ్యాహ్నం 12::00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందనీ పెద్దపల్లి పట్టణ అదనపు సహాయ ఇంజనీర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు.

## హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** హుజురాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నుతాల శ్రీనివాస్ ను ఆదివారం జమ్మికుంటలోని ఆయన స్వగృహంలో బిజెపి నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, జమ్మికుంట పట్టణ బిజెపి మాజీ అధ్యక్షుడు జీడి మల్లేష్‌లు నుతాల శ్రీనివాస్ న్యాయవృత్తిని నమ్ముకుని న్యాయం కోసం వచ్చే పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా న్యాయం వైపు కొట్లాడుతాడనే గొప్ప పేరు సంపాదించారని కొనియాడారు.

# ముదిరాజులను ప్రభుత్వం ఆదుకోవాలి

భీమన్న గుట్ట స్థలానికి సంబంధించి ప్రభుత్వం వెంటనే స్పందించాలి

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ డిమాండ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రోజు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కేంద్రంలోని ముదిరాజ్లు గత వందల సంవత్సరాల నుండి వారసత్వంగా వస్తున్న భీమన్న గుట్టపై సర్వే నెంబర్ 530లోని సుమారు 60 ఎకరాలలో కుల వృత్తి అయిన పండ్ల పెంపకాన్ని చేసుకొని జీవనం గడుపుతున్నారూ.ఇదే అంశమై 2003 వ సంవత్సరంలో పార్లమెంట్ సభ్యుల చొరవతో అదేవిధంగా ముదిరాజ్ నాయకుల అభ్యర్థన మేరకు 2003 వ సంవత్సరంలో మండల రెవెన్యూ అధికారి సర్వే నిర్వహించి సర్వేనెంబర్ 530 లోని 63 ఎకరాల స్థలం ముదిరాజులకు సంబంధించినదని ఉత్తర్వులను కూడా ఇవ్వడం జరిగింది.ఆ స్థలాన్ని ముధీరాజ్ కులస్థులు పండ్ల పెంపకం కోసం ఇవ్వాలని నిర్మల్ జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మేము డిమాండ్ చేస్తున్నాం.. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా యువజన నాయకులు పాతర్ల హరీష్ ముదిరాజ్,అడపచందు,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యతో నియోజక అభివృద్ధి

ఎంబిబిఎస్ విద్యార్థి శ్రవణ్‌కు సన్మానం

మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప అభినందన



**ప్రజా పక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలం టోకిని గ్రామానికి చెందిన సాధారణ రైతు బిడ్డ హివర్కర్ శ్రవణ్ నీట్‌లో అద్భుత ఫలితాలు సాధించి ఎంబిబిఎస్ సీటు పొందాడు. నీట్‌లో ఆల్ ఇండియా ర్యాంకు 205883, బిసి (డి) వర్గం, ఎఆర్ఇ కులంలో 402 మార్కులు సాధించి సురభి ప్రైవేట్ మెడికల్ కాలేజీలో శ్రవణ్ సీటు పొందాడు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్ఎ కోనేరు కోనప్ప తన నివాసంలో శ్రవణ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు హివర్కర్ సాగర్ తన కుమారుడిని ఉన్నత విద్యావంతునిగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో చదివించానని తెలిపారు. శ్రవణ్ సాధించిన విజయంతో తల్లిదండ్రులు సుజాత, సాగర్ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖిజార్ హుస్సేన్, మాజీ ఎంపిటిసి దుర్గం విక్రమ్, నాయకులు పిప్రే రాందాస్, బొర్కుట్ మోహన్, ఇఫ్ఫత్ హుస్సేన్, పిప్రే నిరేష్ తదితరులు పాల్గొన్నారు.



## గడ్డం సుభాష్‌కు బాధిత కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/ముధోల్ :** ఆపద్బాంధవుడిలా ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన గ్రామస్తులను ప్రతి ఒక్కరికి సహాయం చేస్తూ మానవతా దృక్పథాన్ని చాటుకుంటున్నాడు. ముధోల్ మండల కేంద్రానికి చెందిన గడ్డం సుభాష్. మండల కేంద్రంలోని బుద్ధనగర్‌కి చెందినలో బందే గంగాధర్ అనే వ్యక్తి ఇంట్లో ఉన్న మెట్లపై నుండి పడగా చేయి విరగడం జరిగింది. వారి కుటుంబ సభ్యులను ఆయనను సహాయం కోరగా హుటాహుటిన తన స్వంత వాహనంతో బైంసాకి తీసుకెళ్లి ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ప్రీతంతో సంప్రదించగా సమయానికి తగు వైద్యం అందించడం జరిగిందని సుభాష్ అన్నారు. అడిగిన వెంటనే సహాయానికి ముందుకు వచ్చి అండగా నిలిచినందుకు వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తులు సైతం వారి సేవలను అభినందిస్తున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కరాజుల రాజేందర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లడంతో, ఆయన కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రోజున రూ.12 వేల ఆర్థిక సహాయం అందించారు. రాంపూర్ గ్రామస్తుడైన కరాజుల రాజేందర్ తండ్రి పొచ్చయ్య. వారిది నిరుపేద కుటుంబం. రోజు కూలీ చేస్తే గాని జీవనం సాగడం కష్టంగా ఉండే ఈ కుటుంబానికి, రాజేందర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి సంస్థ సభ్యులు ఆసుపత్రి చికిత్స కోసం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకులు కల్లెడ భూమయ్య, మాదాసు రమేశ్ లు మాట్లాడుతూ యువకులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, యువత మద్యానికి బానిస కావద్దని, బుద్ధిగా చదువుకొని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు సింరికొండ వెంకటేష్, ఉపాధ్యక్షులు మురుకుంట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.18.70 కోట్లతో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు అయ్యాయని శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాగజ్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం యుఐడిఎఫ్ పథకం నుండి రూ.18.70 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ నిధులతో పట్టణంలోని పలు కూడళ్లను వార్డులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రహదారులు భవనాల శాఖ పరిధిలోని 55 కిలోమీటర్ల రహదారులను హైబ్రిడ్ అన్యుయిటీ మోడల్ (హెచ్ఎమ్) ఫేజ్ 1 కింద తీసుకున్నామని చెప్పారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్–సిర్పూర్, సిర్పూర్–మాకిడి, కల్వాడ–ఒడ్డుగూడ వయా దహేగాం మార్గాల్లో డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 36 కిలోమీటర్ల రోడ్లను కూడా హెచ్ఎమ్ ఫేజ్ 1 కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రహదారులు భవనాల శాఖకు చెందిన తలోడి, సలుగుపల్లి డబుల్ బిటి రోడ్డు కోసం 25 కోట్ల రూపాయల సెంట్రల్ రోడ్డు ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇటీవల ముఖ్యమంత్రికి పలు ప్రతిపాదనలు పెట్టానని, ఆ నిధులు కూడా మంజూరు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ, మాజీ కౌన్సిలర్ బాల్క శ్యామ్, కుమార స్వామి పాల్గొన్నారు.



## మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి అటవీ శాఖ అండ

**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** మతిస్థిమితం కోల్పోయి గ్రామ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ తిరుగుతున్న వ్యక్తికి సిర్పూర్ టి అటవీ శాఖ అధికారులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. సిర్పూర్ టి మండలం ఇటిక్యాల్ పహాడ్ గ్రామానికి చెందిన గౌత్రే తులసిరాం అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా మతిస్థిమితం కోల్పోయి చిరిగిన బట్టలు, పెరిగిన జుట్టుతో తిరుగుతున్నాడు. తులసిరాం పరిస్థితిని గమనించిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి మోహన్, ఫారెస్ట్ వాచర్లు ఆదివారం రోజున ముందుకు వచ్చి అతనికి స్నానం చేయించారు. జుట్టు కత్తిరించి, కొత్త బట్టలు తొడిగించి కడుపునిండా భోజనం పెట్టారు. అనంతరం అతన్ని ఇటిక్యాల్ పహాడ్ గ్రామంలోని అతని కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా చేర్చారు. అటవీ శాఖ అధికారుల ఈ మానవతా చర్యను స్థానికులు అభినందించారు.

## ముధోల్ మండల కేంద్ర బిసి జెఎసి ఏకగ్రీవం

**ప్రజాపక్షం/ముధోల్ :** ముధోల్ బిసి జెఎసి ఏకగ్రీవ ఎన్నిక ముధోల్ గ్రామ పెద్దలందరి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో ముధోల్ మండల కేంద్ర బిసి జెఎసిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా జిందాం వార్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గుంజల నారాయణ,ఉపాధ్యక్షులుగా బత్తినోళ్ల శంకర్,కోశాధికారిగా దశరథ్,సహ కార్యదర్శి గా మైత్రి మారుతి,బత్తినోళ్ల సాయినాథ్ మరో 11 మందిని కమిటతీ సలహాదారులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బిసిల హక్కుల పోరాటాల సాధనకే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని పెద్దలు తెలిపారు.అందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి జెఎసి నాయకులు రోళ్ల రమేష్,మండల బీసీ జేఏసీ అధ్యక్షుడు బోయిడి అనిల్,ఉపాధ్యక్షుడు గడ్డం సుభాష్,విడిసి అధ్యక్షుడు విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సి.సి.ఐ కొనుగోళ్లు ప్రారంభం

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలోని కాటన్ మార్కెట్ యార్డ్ నందు సి.సి.ఐ కొనుగోళ్ళను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. ఉదయం 9 గంటలకు కొనుగోలు ప్రారంభం అవుతాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సి.సి.ఐ ద్వారా పత్తి క్వింటాలుకు 8110 రూపాయల మద్దతు ధర లభిస్తుందన్నారు. బైంసా, కుభీర్‌లో కేంద్రాలు ప్రారంభం అవుతాయన్నారు.



## బావిలో మృతదేహం

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లి గ్రామ పరిధిలోని రాంరెడ్డిపల్లెలొని వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహాని ఆదివారం పోలీసులు గుర్తించారు. ఖానాపూర్ మండల రాహుల్ గెక్వాడ్ అందించిన వివరాల ప్రకారం కడెం మండలం ఉడుంపూర్ పరిధిలోని గండి రాంపూర్ గ్రామానికి చెందిన నరేష్(22) మానసిక స్థితి బాగాలేదని, గతనెల 31 తారీఖును ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదన్నారు. రాంరెడ్డిపల్లె గ్రామంలోని ఓ రైతుకు మామిడితోటలోని ప్రమాదవశాత్తూ బావిలో పడి గాదె నరేష్ మృతి చెందాడని తెలిపారు. మృతుడు మానసిక రుగ్మత, మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

